# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 55 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

13-12-2025 శనివారం వెల : 1 /- పేజీలు : 4


# ఏపీ ఎన్జీజీఓ టౌన్ ప్రెసిడెంట్‌గా బొత్స శ్రీను



- వరుసగా రెండోసారి బాధ్యతలు అందుకున్న వైనం
- కార్యదర్శిగా బి.నవీన్..పట్టణ కార్యవర్గం ఎన్నిక అంతా ఏకగ్రీవం
- ఏపీ ఎన్జీజీఓలో ఎన్నికల కోలాహలం..సందడిగా మారిన ప్రాంగణం
- కొత్త కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన ఏపీ ఎన్జీజీఓ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, కార్యదర్శి చల్లా శ్రీనివాస్, ఎన్నికల అధికారి ఆర్.వేణు
- ఎన్నికల వేళ కొత్త కార్యవర్గంతో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్... జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ చౌదరి పురుషోత్తం నాయుడు మాటామంతీ...
- బాధ్యతాయుతంగా పనిచేసి ఉద్యోగుల సమస్యల సాధనకు కృషి చేయాలని పిలుపు..

నవతరం -శ్రీకాకుళం

స్థానిక ఏపీఎన్జీజీఓ హోంలో శ్రీకాకుళం పట్టణం తాలుకా ఎన్నికలు పండగ వాతావరణంలో సాగాయి. ఏపీ ఎన్జీజీఓ టౌన్ ప్రెసిడెంట్ గా బొత్స శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక వేళ .. సంబంధిత కార్యాచరణకు సంఘం జిల్లా అధ్యక్షులు, జేఏసీ ఛైర్మన్ హనుమంతు సాయిరాం, కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు నేతృత్వం వహించారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్...జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ చౌదరి పురుషోత్తం నాయుడు శు భాకాంక్షలు తెలిపి, సంఘ విధివిధానాలకు అనుగుణంగా అన్ని తాలుకాల కార్యవర్గాలూ ఉద్యమ స్ఫూర్తిగా పనిచేయాలని పిలుపు ఇచ్చారు.

శ్రీకాకుళం పట్టణ తాలుకాకు సంబంధించి నూతన కార్యవర్గంలో..సమున్నత రీతిలో చోటు దక్కించుకున్నవారిలో..సహాధ్యక్షులుగా ఎస్.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా జె.వేణుగోపాల్, కె.లక్ష్మణ రావు, ఐ.చిట్టిబాబు, బి.వైకుంఠం, పి.యశోద, కార్యదర్శిగా బి.నవీన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా డి.రాజ్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా బి.మధుసూదన రావు, ఎ.రవి కుమార్, పి.జగన్నాథరావు, సబీనా బేగమ్, డాక్టర్ రేవతి, డి.సుజాత, కోశాధికారిగా కె.వి.నారాయణ రావు చోటు దక్కించుకున్నారు. వీళ్లంతా మూడేళ్ల పాటు పనిచేయనున్నారు. ఏపీ ఎన్జీజీఓ సంఘం బలోపేతానికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉమ్మడి కార్యాచరణకు అనుగుణంగా అంతా ఏకతాటిపై నడిచి, రేపటి వేళ అన్ని వర్గాల శ్రేయస్సునూ కోరి పనిచేస్తామని ప్రమాణం చేశారు. ఎన్నికల అధికారిగా రాయి వేణు గోపాల్ వ్యవహరించారు. సహాయ ఎన్నికల అధికారిగా ఏజేఎం రాధాకృష్ణ వ్యవహరించారు.






### 12 తాలుకాల ఎన్నికలు ప్రశాంతం – ఏపీ ఎన్జీజీఓ అధ్యక్షులు హనుమంతు సాయిరాం..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఉన్న పన్నెండు తాలుకాల ఎన్నికలూ ప్రశాంతంగా ముగిశాయి అని ఏపీ ఎన్జీజీఓ అధ్యక్షులు హనుమంతు సాయిరాం తెలిపారు. ఇది ఒక శుభ పరిణామం అని అభివర్ణిస్తూ, సంఘం ఐక్యతను చాటుతూ, ఉద్యోగులంతా నడుచుకోవడం..సుహృద్భావ వాతావరణంలో ఎన్నికలు జరగడం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు. అంతేకాక మనో బలం పెంచిందని, ఆత్మ విశ్వాసానికీ..గౌరవానికీ ప్రతీకగా నిలిచిన సందర్భం ఇది అని భావోద్వేగంతో స్పందించారు.

అలానే గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా ఉద్యోగుల సమస్యలపై స్పందించడం లేదని, ఆ..రోజు పథకాలకే నిధులన్నీ కేటాయించి, ఉద్యోగుల విషయమై ఖాళీ చేతులు చూపించిన వైఎస్సార్ కాంగ్రెస్ హయాంలో నడిచిన ప్రభుత్వాన్ని మరిచిపోలేం అని పెదవి విరిచారు. ఇప్పుడు కూడా ఇదే విధంగా జగన్ కన్నా భిన్నంగా ఏమీ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లేరని దుయ్యబట్టారు. ఈ దశలో ఒకటో తారీఖుకే జీతం అని చెప్పి ఎన్నికల హామీలలో భాగంగా ప్రధాన ఎజెండాగా ఈ నినాదం ఆ..రోజు కూటమి నాయకులు వినిపించినా, ఇప్పుడు అమలు మాత్రం ఇందుకు భిన్నంగా ఉందని ఆవేదన చెందారు. డిసెంబరు నెల ఆరంభం అయిన 11 రోజులు పూర్తవుతున్నా ఇంకా జీతాలు లేవని, ఉద్యోగుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆవేదన చెందారు. ఇప్పటికైనా మానవతా దృక్పథంలో భాగంగా ప్రభుత్వం స్పందించి తక్షణమే జీతాల చెల్లింపులపై దృష్టి సారించాలని కోరారు.

### వీళ్లే ఎగ్జిక్యూటివ్ మెంబర్లు :- – జిల్లా కార్యవర్గంలో నలుగురు ఈసీలు – పట్టణ కార్యవర్గంలో 13 మంది ఈసీలు నియామకం

. జిల్లా కార్యవర్గానికి సంబంధించి వీళ్లంతా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సూర్య ప్రకాశ్, వైఎస్ కిరణ్ కుమార్, కేఎంఎం.నారాయణ రావు, కె.వరప్రసాద్ నియమితులయ్యారు. ఇదే సందర్భంలో టౌన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎల్.శ్రీదేవి, కె.సంతోష్ కుమార్, బి.ఉదయ్ కుమార్, ఎస్.సాయి కుమార్, వి.రవిశేఖర్, ఎ.ఉమా మహేశ్వర రావు, సిహెచ్.కోదండ, కె.డిల్లేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, కె.నారాయణమ్మ, బి.ఎర్రన్నాయుడు, జె.ఉదయ్ కుమార్, ఎ.చంద్రమౌళి నియమితులయ్యారు. సంబంధిత వివరాలను ఏపీ ఎన్జీజీఓ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం ఓ ప్రకటనలో వెల్లడించారు.

### సభ్యులందరికీ సమాన అవకాశాలు :-

ఈసారి తాలుకాలకు సంబంధించిన కార్యవర్గాలలో యువతకూ, మహిళలకూ, అలానే సీనియర్లకూ సముచిత రీతిలో సమాన నిష్పత్తిలో అవకాశం కల్పించామని, ప్రతి కార్యవర్గంలోనూ మహిళలకు 33 శాతం రిజర్వేషను అమలు చేశామని స్పష్టం చేశారు. ఏపీ ఎన్జీజీఓ సంఘం బలోపేతంలో భాగంగా..అన్ని శాఖల ఉద్యోగులూ ఏకతాటిపై వచ్చి నూతన కార్యవర్గాలతో కలిసి పని చేయాలి విన్నవించారు. ఇప్పటిలానే అంతా సఖ్యతతో, నడిచి సంఘటిత శక్తిని చాటి, ఉద్యోగుల సమస్యలపై ఉద్యమించేందుకు రాష్ట్ర కార్యవర్గం సూచన మేరకు రూపొందించనున్న కార్యాచరణను అమలు చేద్దాం అని పిలుపు ఇచ్చారు. గతంలో మాదిరిగానే ఉద్యోగులంతా ఓ కుటుంబం అని భావిస్తూ, సంబంధిత సమస్య విషయమై ఎప్పటికప్పుడు చర్చిస్తూ పాలక వర్గాలపై ఒత్తిడి తీసుకుని వచ్చైనా సరే ! డిమాండ్ల సాధనకు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఇవాళ ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

# అరసవల్లిలో వైద్య శిబిరానికి పెద్దస్పందన

## గర్భిణీలకు ఉచిత వైద్య సేవలు






నవతరం అరసవల్లి

అరసవల్లి Dr.ఇంజారాపు మోహనరావు క్లినిక్‌లో శు క్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్థానికులతో పాటు కాజీపేట, పరిసర గ్రామాల నుంచి గర్భిణీ స్త్రీలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. వందమందికి పైగా మహిళలు ఈ శిబిరంలో వైద్యం పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేమ్స్ హాస్పిటల్‌కు చెందిన Dr. వాకా నందిని గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించారు. శిబిరాన్ని Dr.ఇంజారాపు మోహనరావు పర్యవేక్షించగా, శ్రీకాకుళం జేమ్స్ మదర్ అండ్ చైల్డ్ ఎగ్జిక్యూటివ్ వెంకుమహంతి లక్ష్మణరావు పాల్గొన్నారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉచిత వైద్య సేవలు కొనసాగుతాయని నిర్వాహకులు ప్రకటించారు.

# రిమ్స్ సూపరింటెండెంట్‌ను సత్కరించిన పీఎంపీలు

- సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డా.ప్రసన్నకుమార్‌కు సత్కారం
- గ్రామీణ ఆరోగ్య సేవల్లో పీఎంపీల పాత్ర కీలకమని సూచన
- తల్లి-బిడ్డల భద్రతకు ప్రభుత్వ ఆస్పత్రులకే రిఫర్ చేయాలని విజ్ఞప్తి



2లో



# రోడ్డు ప్రమాద దుర్ఘటన తనను తీవ్రంగా కలచివేసింది



నవతరం -శ్రీకాకుళం

అల్లూరి జిల్లాలో రోడ్డు ప్రమాద దుర్ఘటన తనను తీవ్రంగా కలచివేసింది అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.

చింతూరు – మారేడుమిల్లి ఘాట్ రోడ్డు ప్రమాద ఘటనలో 9 మంది చనిపోవడం దురదృష్టకరం అని ఈ రోజు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని అధికారులకు ఆయన ఆదేశించారు. పొగమంచు కారణంగా వరుస ప్రమాదాల నేపథ్యంలో వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

# కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో పాల్గొనండి



వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పిలుపు

2లో

ఎడిటోరియల్

# విజన్ నిజమయ్యేనా..!

రాష్ట్రంలో పేదరికం, వివక్షతలను దూరం చేసేందుకు, అందరికీ విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంటును రూపొందించిట్టు గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ దార్శనిక పత్రం రాష్ట్ర భవితవ్యానికి రోడ్‌మ్యాప్‌గా పేర్కొన్నారు. రైతులు, మహిళలు, యువత సమస్యలు, పిల్లల ఇబ్బందులు, సామాజిక అవసరాలు, ఆకాంక్షలు తీర్చేలా డాక్యుమెంటు పరిష్కారం చూపిస్తుందని అభిప్రాయడ్డారు. ప్రయివేటు పెట్టుబడులను ఆహ్వానించడం తప్పుకాదు. అదే క్రమంలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు ప్రభుత్వ, ప్రజాధనాన్ని ఏమేరకు ధారపోస్తున్నామనేది కూడా గమనంలో ఉండాలి. ప్రభుత్వ భూములు, వనరులను ప్రయివేటు పెట్టుబడిదారులకు అప్పగించే నేపథ్యంలో మన సమాజానికి ఎలాంటి ప్రయోజనాలు ఒనగూర నున్నాయో కూడా చూడాలి. విలువైన మౌలిక వసతులను కల్పిస్తున్న తరుణంలో అప్రమత్తత అవసరం. తెలంగాణ అన్‌స్టాపబుల్ అని సర్కారు చెబుతుంటే, అన్‌బీటబుల్ అని పారిశ్రామికవేత్తలు ఊదర గొడుతున్నారు. నిజంగా ఇవి నెరవేరాలంటే పేదల పట్ల ప్రేమ, కార్యాచరణలో చిత్తశుద్ధి తప్పనిసరి.

గత ప్రభుత్వాలతోపాటు తాజా సర్కారు కూడా ప్రపంచ ఆర్థిక సదస్సుల్లో పాల్గొని తెచ్చిన పెట్టుబడులు, వచ్చిన ఫలితాలను ప్రజల వివరించాలి. సర్కారు పారదర్శకత జనానికి అద్దంలా కనిపించాలి. 'దూరపు కొండలు నునుపు' అనే నానుడి మనకు కొత్తేమి కాదు. సమ్మిట్‌లో రూ.5.75 లక్షల కోట్ల మేరకు పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని ముగింపులో ప్రభుత్వం ప్రకటించింది. సీఎం , మంత్రులు గత రెండేండ్లల్లో రెండేసి మార్లు పెట్టుబడుల ఆర్థిక వేదిక దావోస్‌కు వెళ్లొచ్చారు. అప్పట్లో వచ్చిన కంపెనీలు, ఉద్యోగాలు, ప్రయోజనాలను ప్రజలకు చెప్పి ఉంటే గ్లోబల్ సమ్మిట్‌కు మరింత విలువ పెరిగుండేది. దేశంలో ప్రభుత్వ సంస్థలు, వ్యవస్థలను ప్రయివేటీకరణ పేర మొత్తంగా తెగనమ్మేయడం చూస్తున్నాం. అప్పుడైతే కేంద్రం ఏకంగా ఒక మంత్రిత్వశాఖనే ఏర్పాటు చేసింది. ప్రయివేటు పెట్టుబడిదారులకు భూములు, విద్యుత్, నీరు రూపేణా ఎంతమేర ఎదురిస్తున్నామనేది లెక్క లేయాల్సిందే. ఆ మేరకు స్థానిక ప్రజలకు మేలు జరుగుతుందా? సమ్మిట్ ఆరంభ శూరత్వం కాకూడదు. అర్థవంతమైన సదస్సు కావాలి. ఎందుకంటే దేశంతోపాటు ప్రపంచం సాంతం పరిణామాలను పరిశీలిస్తే పెట్టుబడి, తదనంతర పరిస్థితులు ప్రజావ్యతిరేకంగా ఉంటున్నాయి. ఇండిగో విమానయాన సంస్థ వ్యవహారం ఆ కోవలోనిదే. మార్కెట్ లో అరవై ఐదు శాతం వాటాను చేజిక్కించుకుని ఆకాశాన్ని తమ ఇష్టానుసారం వాడు కుంటామని చెప్పకనే చెప్పింది, కేంద్ర పభుత్వాన్ని సవాల్ చేసింది. ప్రయాణికులను అనేక ఇబ్బందులకు గురిచేసింది. 'నీరు పల్లమెరుగన్నట్టు పెట్టుబడి లాభమెరుగు' అనేది ఇక్కడ అక్షరాలా నగసత్యం. లాభాల కోసం పెట్టుబడిదారులు ప్రజా ప్రయోజనాలను సైతం ఫణంగా పెట్టడానికి సిద్ధపడతారని చెప్పడానికి ఇండిగో కంటే ప్రత్యక్ష సాక్ష్యం మరొకటి అక్కర్లేదు. టెలికాం రంగంలో పట్టుసాధించేంతవరకు ఉచిత డేటాను ఇచ్చి ఆనక ఇష్టారాజ్యంగా ప్యాకేజీల రేట్లను పెంచి దండుకుంటున్న అంబానీల జియో సంగతీ అందరికీ తెలిసిందే. ఇందుకు ప్రతిచర్యగా ఒకేరోజు డెబ్బయి లక్షల మంది జియో వినియోగదారులు ఇటీవల తమ సర్వీసులను రద్దుచేసుకున్నారు.

ఒక్కో పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు ఒక్కో నినాదాన్ని లేదా విధానాన్ని ఎంచుకుంటూ పరిపాలన సాగిస్తుంటాయి. ఇది సాధారణమే. కాగా ఆ పాలనలోని సారం ప్రజలకు ఏమాత్రం అందుతున్నదనేదే కీలకం. మన కండ్లముందున్న విజన్ 2020, బంగారు తెలంగాణ నినాదాల ఫలితాలను విశ్లేషించుకుంటే స్పష్టత వస్తుంది. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ వరకు ప్రభుత్వాల ప్రణాళికలు, స్వర్ణాంధ్ర, బంగారు తెలంగాణ వాటి అమలును గమనిస్తే 'ఎక్కడ వేసిన గొంగలి అక్కడే' అన్న చందంగా ఉంది. ప్రణాళికలు స్వల్పమైనా, దీర్ఘకాలికమైనా మన అడుగులు సక్రమంగా ఉన్నాయా? లేవా? అనేది గుర్తించాలి.

ఇప్పటికే సర్కారు నెత్తిన రూ.8 లక్షల కోట్ల అప్పు ఉంది.

పెట్టుబడిదారులకు కల్పించే మౌలిక వసతుల వెనక పేదల కష్టార్జితం మిళితమై ఉందనే సంగతిని మరిచిపోకూడదు. మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యంగా రేవంత్ సర్కారు చేస్తున్న ఈ ఫీట్లు భవిష్యత్ తరాలకు శాపంగా మారకుండా విజ్ఞత ప్రదర్శించాలి. వ్యవసాయం, నీటిపారుదల, విద్యా వైద్యం, మౌలిక రంగాల్లో ప్రభుత్వం పెట్టుబడులు వస్తాయని మురిసిపోతున్న వాళ్లు, రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఎలాంటి హామీనిస్తారో స్పష్టం చేయాలి. దేశంలో రోజుకు వెయ్యి చొప్పున ఎంఎస్ఎంఈలు, ఇతర సంస్థలు మూతపడుతున్న తరుణంలో కొత్త పెట్టుబడులతో కలగనున్న మేలేమిటో చెప్పగలగాలి.

# రిమ్స్ సూపరింటెండెంట్‌ను సత్కరించిన పీఎంపీలు

**నవతరం -శ్రీకాకుళం**

పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రిమ్స్ మెడికల్ కళాశాలలో కొత్తగా సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ లుకలాపు ప్రసన్న కుమార్ గారిని పీఎంపీ సభ్యులు సత్కరించారు. సాలువా కప్పి పూల బొకే అందజేశారు. డాక్టర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పీఎంపీల సేవలు ఎంతో అవసరం అని, తమ పరిధిలో ప్రథమ చికిత్స సమయానికి అందించాలని సూచించారు. డెలివరీ కేసులను గవర్నమెంట్ సర్వజన ఆస్పత్రిలో ఎక్కువ శాతం నార్మల్‌గా చేస్తున్నందున, గ్రామస్థాయిలో గర్భిణీ సమస్యలున్న వారు ఉంటే వెంటనే గవర్నమెంట్ హాస్పిటల్‌కు రిఫర్ చేయాలని, తల్లి-బిడ్డల రక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వందన సిమ్మన్న, జిల్లా కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణ, ట్రెజరర్ కె. జనార్దన్ రావు, జాయింట్ సెక్రటరీ చిన్నాల రాము, ఈసీ సభ్యులు ఎ. ముసల నాయుడు, జి. గిరిబాబు, సీనియర్ సభ్యులు ఎం. అప్పలరాజు,ఇంజారాపు మోహన్ రావు, ఎం. లవడు, డి. వాసు, ఆర్. తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో పాల్గొనండి

**నవతరం -శ్రీకాకుళం**

స్థానిక టౌన్ హాల్‌లో ఈ నెల 15న 'కోటి సంతకాల ప్రజా ఉద్యమం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నామని, ఈ ఉద్యమంతో పాటు బహిరంగ సభ కూడా ఏర్పాటు చేసినట్టు వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. బహిరంగ సభ అనంతరం 'కోటి సంతకాల ప్రత్యేక వాహనాన్ని' జెండా ఊపి కేంద్ర పార్టీ కార్యాలయానికి పంపనున్నామని, ప్రతి ఒక్క కుటుంబ సభ్యుడు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కృష్ణ దాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, రాష్ట్ర పొందర కూరాకుల విభాగం అధ్యక్షుడు రాజపు అప్పన్న, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు సురంగి నర్సింగరావు , రాష్ట్ర ఐటీ విభాగం కార్యదర్శి కిల్లి అజయ్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సతివాడ రామినాయుడు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్ణిక జీవన్, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు బబ్బోది ఈశ్వరరావు, మండల ఆర్టీఐ అధ్యక్షుడు దుల్ల రమణ, బడ్డ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మం గొప్పది

- ఇది మామూలు సినిమాలు సాధించే విజయం కాదు
- జిల్లా నందమూరి బాలకృష్ణ మోక్షజ్ఞ ఫ్యాన్స్ అధ్యక్షుడు, ఎన్టీఆర్ మోక్షజ్ఞ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు మాదారపు వెంకటేష్

**నవతరం -శ్రీకాకుళం**



భారత దేశ సనాతన ధర్మ బలం, గొప్పతనం, భారతీయుని అచంచల దైవత్వం, దమ్ము, దైర్యం, గొప్పతనం, దేశ కీర్తి, ఖ్యాతి ఖండాంతరాలకు విస్తరించి ఆయా దేశాలు, ప్రజలు సనాతన ధర్మం, దేశభక్తి కి సలాం చేస్తూ గులామయ్యే అద్భుతం అఖండ -2 తాండవమని జిల్లా నందమూరి బాలకృష్ణ మోక్షజ్ఞ ఫ్యాన్స్ అధ్యక్షుడు, ఎన్టీఆర్ మోక్షజ్ఞ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు మాదారపు వెంకటేష్ పేర్కొన్నారు. 'పాన్ ఇండియా స్థాయిలో ఇంతటి అమోఘ , అఖండ విజయాన్ని అందించిన యావత్తు భారతీయులు, ముఖ్యంగా తెలుగు వారి కీర్తి, బలం, దైర్యం, ప్రపంచానికి నిలువెత్తు రూపంలో అఖండునిగా, దేశ సనాతన ధర్మ సంరక్షకునిగా జీవించిన నట సింహ పద్మ భూషణ్ నందమూరి బాలకృష్ణ నటన అత్యద్భుతమని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రంతో పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణకు జాతీయ ఉత్తమ నటుడిగా పురస్కారం లభించడం ఖాయమని, ఆ గౌరవం బాలయ్యకే కాదని, యావత్తు భారతావనిదని ఆయన పేర్కొన్నారు. చిత్ర ఘన విజయాన్ని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు అందించిన సీఎం చంద్రబాబు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌తోపాటు చిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను, నిర్మాత, దర్శకులు, సంగీత దర్శకులు తమన్, తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శితమైన ప్రీమియర్ షోస్‌కు విచ్చేసి, అఖండ -2 తాండవం చిత్ర అద్భుత విజయంలో పాల్గొన్నవారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాకుళం రామలక్ష్మణలో ప్రదర్శితమైన ప్రీమియర్ షోకు విచ్చేసిన శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు శంకర్, చిత్ర సాంకేతిక బృందానికి, అనునిత్యం బాలయ్యకు అండగా నిలుస్తూ, శ్రమించే నందమూరి అభిమానులు, చిత్ర పంపిణీదారులు, థియేటర్ యాజమాన్యం, పాత్రికేయ మిత్రులకు కృతభివందనాలు తెలియజేస్తున్నామని వెంకటేష్ పేర్కొన్నారు.

# శాడిస్టు శునకాలు...?

(ఓ కన్నతల్లి కన్నీటి గాథ) దీర్ఘ కవిత..!!



పార్టు...2

ఏ తప్పు చేయని
నాపై ఎందుకింత కక్ష..?
ఏమిటి నాకీ శిలువ శిక్ష..?
పిచ్చి కోపంతో రెచ్చిపోయి
నన్నెందుకు చచ్చిపోయేదాకా
మీ చేతులు నొప్పులు పుట్టేదాకా
నాఒంట్లో ఎముకలు విరిగిపోయేదాకా

ఏదో పూనకం
వచ్చిన పులులు
కాలిరిగి పరుగెత్తలేని
జింక మీదపడినట్లు
నిస్సహాయిరాలనైన
నాపై విరుచుకు పడి నన్ను
చిత్రహింసలు పెట్టడమెందుకు..?
ఇన్నిదెబ్బలు కొట్టడమెందుకు..?
ఇంతగా శిక్షించడం మెందుకు...?

పెరట్లో పడేసి ఇద్దరు
నా శరీరంతో ఆడుకుంటున్నారే
ఎంత వేడుకున్నా వినిపించుకోరే

ఇది ధర్మమా కోడలా...
ఇది న్యాయమా కొడుకా...
కాస్త దయ చూపండిరా...
అసలు నన్నిలా చిత్రహింసలకు
గురిచేసే హక్కు మీకెక్కడిదిరా...?

అసలు ఎందుకు
నాపై మీకింత ద్వేషం..?
ఎందుకు నాపై మీరింతగా
విరుచుకు పడుతున్నారు..?
ఎందుకు నాపై పెంచుకున్నారింత
కక్ష..?
నేనేం తప్పు చేశానని నాకీ శిలువశిక్ష..?



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



**నవతరం -శ్రీకాకుళం**

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పారిశ్రామికవేత్తల నైపుణ్య శిక్షణ కేంద్రం ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ గారు హాజరై ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్య చంద్ర రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న "ప్రతి ఇంటా ఒక వ్యాపారవేత్త" లక్ష్యంతో మహిళలు, యువత ఆర్థిక స్వావలంబన సాధించాలని ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక వాడల అభివృద్ధి, పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల సృష్టి వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అలాగే యువనేత లోకేష్ బాబు గారు విద్య, ఐటి రంగాలను ప్రపంచ దృష్టిని ఆకర్షించే విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారని, ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ఇన్నోవేషన్ ఈవెంట్‌లో 16 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చాయని గుర్తుచేశారు. ఈ శిక్షణ కార్యక్రమం వరల్డ్ బ్యాంక్, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు, MSME-RAMP Programme, మరియు Threads IT Hyderabad సహకారంతో సమర్థవంతంగా నిర్వహించబడుతున్నదని త్రెడ్స్ ఐటి ప్రాజెక్ట్ ఇంచార్జ్ జి. అరుణ్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణారావు, కామర్స్ విభాగాధిపతి మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. అతిథులుగా బోనెల అప్పారావు, కె.ఎ. రాజు, సంతోషి పట్నాయక్, లలితభాయ్, గౌతం పవన్, బన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వివాహ ఆటంకాలు తీర్చే ఆలయం తిరుమనంజేరి-తమిళనాడు



తమిళనాడులోని తిరుమనం జేరి ఆలయం, శివుడు మరియు పార్వతీదేవి వివాహ స్థలం వివాహ సంబంధిత సమస్యలను పరిష్కరించి త్వరగా వివాహాలు కుదురుచడానికి ప్రసిద్ధి చెందిన వెయ్యి సంవత్సరాల పైగా చరిత్ర ఉన్న పురాతన శివాలయం. ఈ ఆలయం దర్శనం వల్ల పెళ్లి ఆటంకాలు తొలగిపోతాయని, పెళ్లి కాని వారు వివాహంలో అడ్డంకులు ఎదుర్కొంటున్న వారు ఈ ఆలయానికి వచ్చి శివపార్వతుల అనుగ్రహం కోరుకుంటారు వారి ప్రార్థనలు ఫలించి త్వరగా పెళ్లి అవుతుందనే నమ్మకం. పైగా కొందరు తమ భాగస్వామి నుండి విడిపోయిన తర్వాత కొత్త జీవితాన్ని ప్రారంభించాలి అనుకునే వారికి వేరే పూజలు కూడా ఈ ఆలయంలో నిర్వహిస్తారు. శివుడు పార్వతీ దేవి వివాహం ఇక్కడ జరిగిందని ఈ ప్రదేశం పెళ్లి జరిగిన ఊరు అని అర్థం వచ్చేలా " తిరుమనం జేరి " అనే పేరు వచ్చిందని పురాణ కథనం. ఈ మందిరం తిరుమనం చేరి ప్రజల ఆశీర్వాదం పొందింది,కావేరి నదికి సమీపంలో ఉన్న హిందూ దేవాలయం.

ఈ ఆలయం శివుడికి అంకితం చేయబడింది మరియు ఈ ప్రాంతంలో ఎక్కువగా సందర్శించే యాత్రా స్థలాలలో ఒకటి. ఈ ఆలయం చోళ రాజవంశం కాలంలో నిర్మించబడిందని నమ్ముతారు మరియు అనేక పునర్నిర్మాణాలు మరియు చేర్పులకు గురైంది. ఆలయ నిర్మాణం ద్రావిడ మరియు విజయనగర శైలులను మిళితం చేస్తుంది, గోడలు మరియు పైకప్పులను అలంకరించే క్లిష్టమైన శిల్పాలు మరియు శిల్పాలతో అలరారు తున్నది.

ఈ ఆలయంలో ప్రధాన దైవం శివుడు, ఆయనను తిరుమనంజేరి నాథర్ గా పూజిస్తారు. ఈ ఆలయంలో విష్ణువు, మురుగన్ మరియు ఇతర దేవతలకు కూడా మందిరాలు ఉన్నాయి. ఈ ఆలయం వివాహం మరియు కుటుంబంతో అనుబంధానికి ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉంది మరియు వివాహాలు మరియు ఇతర ముఖ్యమైన కుటుంబ వేడుకలను నిర్వహించడానికి మంచి ప్రదేశంగా పరిగణించబడుతుంది.

తిరుమంజేరి ఆలయం యొక్క ప్రత్యేక లక్షణాలలో ఒకటి దాని పవిత్రమైన చెరువు. దీనిని కళ్యాణ తీర్థం అని పిలుస్తారు. ఈ చెరువు దైవిక శక్తులను కలిగి ఉందని మరియు వ్యాధులను నయం చేయగలదని మరియు దాని నీటిలో ముంచిన వారికి అదృష్టాన్ని తెస్తుందని చెబుతారు.

## స్థల పురాణం

ఈ ఆలయంలో పార్వతీ పరమేశ్వరులు కొలువుతీరటం వెనుక ఓ ఆసక్తికరమైన కథ ఉన్నది. ఓసారి ఆది దంపతులు సరదాగా పాచికలు ఆడుతున్నారట. తాను ఓడిపోకూడదనే ఉద్దేశంతో స్వామి ఆట మధ్యలో అమ్మవారిని గోవుగా మార్చేసి భూలోకానికి పంపించేశాడట. అయితే తాను చేసిన పొరపాటును గ్రహించి మహా విష్ణువుతో విషయం చెప్పి.. పార్వతీదేవికి శాపవిమోచనాన్ని కలిగించమంటూ అభ్యర్థిం చాడట. దాంతో విష్ణుమూర్తి గోవుల కాపరిగా మారిపోయి పార్వతీదేవిని కాపా డటం. మొదలు పెట్టి చివరకు శాప విమోచ నాన్ని కలిగించాడట. ఆ తరువాత అమ్మ వారు ఈ ప్రాంతంలోనే భరతమునికి కూతురిగా జన్మించింది. ఆ ముని ఇక్కడే అమ్మవారికి స్వామితో కల్యాణాన్ని జరిపిం చాడనీ అలా ఈ ఊరు తిరుమనంజేరిగా ప్రసిద్ధి పొందిందనీ కథనం. అదే విధంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరుగుతు న్నప్పుడు కైలాసం దేవతలతో కిక్కిరిసిపో యిందట. దాంతో స్వామి అగస్త్యమునితో.. దక్షిణభారత దేశంలో భక్తుల కోసం ఓ ఆలయాన్ని నిర్మించమని చెప్పాడట. అలా అగస్త్యుడు ఇక్కడకు వచ్చి శివలింగాన్ని ప్రతిష్ఠించాడనే కథనమూ ప్రాచుర్యంలో ఉంది. ఒకానొక సందర్భంలో... పార్వతీదేవి పరమేశ్వరుడితో తనకు భూలోకంలోనూ కల్యాణం చేసుకోవాలని ఉందని చెప్పడం, స్వామి అంగీకరించడంతో... దేవి భరతముని కూతురిగా జన్మించిందనీ.. ఆ మునే శివపార్వతుల వివాహం చేశాడనీ అంటారు. అలా కొలువుదీరిన స్వామికి చోళ రాణి అయిన సెంబియన్మాదేవి ఆలయాన్ని కట్టించిందని ప్రతీతి.



ఈ ఆలయంలో మొదట భక్తులు సెల్వగణపతిని దర్శించుకుంటారు. ఆ తరువాత కల్యాణసుందరేశ్వరర్ , ఉద్వగనాథర్ గా పిలిచే పరమేశ్వరుడిని పూజించాక.. కోకిలాంబాళ్ కొలువుదీరిన జగన్మాత మందిరానికి వెళ్తారు. ఆ తరువాత పాణిగ్రహణ భంగిమలో ఉండే ఆదిదంపతుల్ని దర్శించుకుంటారు. అప్పుడప్పుడే తమ పిల్లలకు పెళ్లి ప్రయ త్నాలు మొదలు పెట్టినవాళ్లకూ, రకరకాల కారణాల వల్ల పెళ్లి ఆలస్యం అవుతున్న వాళ్లకూ ఈ మందిరంలోనే ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అందులో భాగంగా దేవత లకు వేసిన దండలను తీసి భక్తులకు ఇస్తారు. ఆ హారాల్ని ఇంటికి తీసుకెళ్లి భద్రపరిచి పెళ్లయ్యాక నవదంపతులుగా మళ్లీ ఆ దండలతో తిరిగొచ్చి.. పూజలు చేయించుకోవాలని చెబుతారు అర్చకులు. అలాగే సంతానం లేనివాళ్లు కూడా పౌర్ణమి తిథుల్లో ఇక్కడకు వచ్చి ప్రత్యేక పూజలు చేయించుకుంటారు. ఇక, వైవాహిక బంధంలో సమస్యలున్నవారూ ఈ ఆల యాన్ని దర్శించుకుంటే అవి తొలగిపోతా యనీ.. అలా వచ్చే జంటలూ ఎక్కువేనని అంటారు.

తిరుమనంజేరి ఆలయం యొక్క ప్రత్యేక లక్షణాలలో ఒకటి దాని పవిత్రమైన చెరువు దీనిని కళ్యాణతీర్థం అని పిలుస్తారు ఈ చెరువు దైవిక శక్తులను కలిగి ఉందని మరియు వ్యాధులను నయం చేయగలదని,ఈ నీటిలో ముంచిన వారికి అదృష్టం తెస్తుంది అని చెబుతారు. తిరుమనంజేరి ఆలయానికి వచ్చే సందర్శకులు సమీపంలోని దేవాలయాలైనా వాటిలో కుంభకోణం పట్టణం కూడా ఉంది. ఇది దేవాలయాలు, చారిత్రక కట్టడాలకు ప్రసిద్ధి చెందింది. ఆదికుంభేశ్వర ఆలయం, సారంగపాణి ఆలయం ఈ ప్రాంతంలోని అత్యంత ప్రసిద్ధ ఆలయాలలు.

తిరుమనం చేరి ఆలయం హిందువులకు ఒక ముఖ్యమైన యాత్రా స్థలం మరియు వివాహం మరియు కుటుంబముతో అనుబంధానికి ప్రసిద్ధి చెందింది ఈ ఆలయం యొక్క ప్రత్యేకమైన నిర్మాణం పవిత్ర చెరువు మరియు పండుగలు దక్షిణ భారత సంస్కృతి మరియు సంప్రదాయాలపై ఆసక్తి ఉన్నవారు ఎవరైనా తప్పక సందర్శించి, ఈ ప్రాంతం యొక్క గొప్ప చరిత్ర వారసత్వాన్ని ఆస్వాదించవచ్చు. ఈ ఆలయానికి చేరుకోవాలి అంటే మైలాడుతురై లేదా కుంభకోణం రైల్వే స్టేషన్లో దిగితే బస్సులు, ప్రైవేటు వాహనాలు, ఆటోల సౌకర్యంగా ఉంది.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# రివాల్వర్ రీటా.. గురి తప్పిన తూటా

'మహానటి'తో గొప్ప పేరు సంపాదించిన కీర్తి సురేష్.. ఆ తర్వాత అనేక లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేసింది. కానీ అవేవీ పెద్దగా ఫలితాన్నివ్వలేదు. ఇప్పుడామె 'రివాల్వర్ రీటా' అవతారం ఎత్తింది. జేకే చంద్రు రూపొందించిన ఈ చిత్రం.. ఈ రోజే తెలుగు-తమిళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి. పాండిచ్చేరికి చెందిన రీటా (కీర్తి సురేష్) ఒక రెస్టారెంట్లో పని చేస్తుంటుంది. తండ్రి లేని ఆమె.. తల్లితో పాటు అక్క-చెల్లితో కలిసి కష్టపడి బతుకుతుంటుంది. రీటా ఒక రోజు తన అక్క కూతురు పుట్టిన రోజు వేడుకకు రెడీ అవుతున్న టైంలో పాండిచ్చేరిలో పెద్ద రౌడీ అయిన డ్రాకులా పాండ్యన్ (సూపర్ సుబ్బరాయన్) అనుకోకుండా వాళ్లింటికి వచ్చి ప్రాణాలు కోల్పోతాడు. దీంతో అతడి శవాన్ని ఏం చేయాలో తెలియక అయోమయంలో పడుతుంది రీటా కుటుంబం. ఇంతలో పాండ్యన్ కొడుకు బాబీ (సునీల్) తన తండ్రి కోసం వెతకడం మొదలుపెడతాడు. పాండ్యన్ చావు కోసం ఎదురు చూస్తున్న గ్యాంగ్స్ మధ్య తన శవం కోసం కొట్లాట మొదలవుతుంది. ఇంకోవైపు పోలీసుల కళ్లు రీటా కుటుంబం మీద పడతాయి. వీళ్లందరినీ తప్పించుకుని ఈ సమస్య నుంచి రీటా కుటుంబం బయటపడిందా లేదా అన్నది మిగతా కథ. క్రైమ్ కామెడీల్లో చెప్పుకోదగ్గ కథ గురించి ప్రేక్షకులకు పెద్దగా పట్టింపు ఉండదు. కథనం ఎలా ఉందన్నదే చూస్తారు. డబ్బు చుట్టూనో లేదంటే ఏదైనా విలువైన వస్తువు చుట్టూనో.. లేదంటే ఒక హత్య చుట్టూనో తిరిగే ఈ కథలకు కథనమే చాలా ముఖ్యం. రేసీ స్క్రీన్ ప్లే.. ఆసక్తికర మలుపులు.. సిచువేషనల్ కామెడీ.. ఇవి ఉన్నాయంటే ఈ జానర్ సినిమాలను ఓ వర్గం ప్రేక్షకులు నెత్తిన పెట్టుకుంటారు. కానీ ఈ దినుసులు సరిగా కుదరకపోతే మాత్రం మొత్తం వంటకం తేడా కొట్టేస్తుంది. 'రివాల్వర్ రీటా'లో అదే జరిగింది. కథ మాత్రమే కాకుండా కథనం కూడా మరీ రొటీన్ గా సాగడం.. ఎన్నో సినిమాల్లో చూసిన సన్నివేశాలే ఇందులోనూ కనిపించడం.. కీర్తి సురేష్ నుంచి ప్రేక్షకులు ఆశించే పెర్ఫామెన్స్ ఏమీ లేకపోవడంతో 'రివాల్వర్ రీటా' ఒక సాధారణ చిత్రంగా మిగిలిపోయింది. నయనతార ప్రధాన పాత్రలో కొన్నేళ్ల ముందు 'కొకో కోకిల' అనే ఒక సినిమా వచ్చింది గుర్తుందా? 'జైలర్' దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ డెబ్యూ మూవీ అది. ఆ డార్క్ క్రైమ్- కామెడీ థ్రిల్లర్ అంటే ఎలా ఉండాలో అదొక బెంచ్ మార్క్ సెట్ చేసింది కోలీవుడ్లో. పైకి అమాయకంగా కనిపించే అమ్మాయి.. అనుకోకుండా తన ఫ్యామిలీతో ఒక క్రైంలో భాగమై.. దాన్నుంచి బయటపడడానికి ఏం చేసింది.. తన తెలివితేటలతో అందరి ఆట ఎలా కట్టించిందనే కథతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా.. వినోదాత్మకంగా సాగిన చిత్రమిది. 'రివాల్వర్ రీటా' దర్శకుడు జేకే చంద్రుకు కూడా ఆ సినిమానే స్ఫూర్తిగా నిలిచినట్లుంది. ఐతే స్ఫూర్తి పొందడం వరకు ఓకే కానీ.. అతను దాదాపుగా అదే కథతోనే ఈ సినిమా తీశాడు. కానీ అందులో ఉన్నవి.. ఇందులో లేనివి ఏంటంటే.. కొత్తదనం-ఉత్కంఠ-వినోదం. 'రివాల్వర్ రీటా' లాంటి కథలు ఇండియన్ స్క్రీన్ మీద ఇలాంటి కథలో కోకొల్లలుగా వచ్చాయి. వాటి నుంచి భిన్నంగా నిలబెట్టే అంశాలేవీ ఇందులో లేవు. పేరుకు సినిమాలో ట్విస్టులు చాలానే ఉన్నాయి కానీ.. అవేవీ ప్రేక్షకులను ఆశ్చర్యపరచవు. కొంచెం కూడా థ్రిల్ పంచవు. కామెడీ కూడా ఇలాంటి ఫీలింగే ఇస్తుంది. బలవంతంగా నవ్వాలనుకున్నా నవ్వు రాని పరిస్థితి.




పాండిచ్చేరిలో ఒక పెద్ద రౌడీ.. దారి తప్పి అనుకోకుండా హీరోయిన్ ఇంట్లోకి వస్తాడు. హీరోయిన్ తల్లి హడావుడిలో ఒక దెబ్బకొడితే చనిపోతాడు. ఈ క్రైమ్ నుంచి హీరోయిన్ కుటుంబం తప్పించుకోవడానికి వాళ్లు ప్రయత్నిస్తుంటే.. వాళ్ల వెంట పడే రౌడీలు, పోలీసులుతో క్యాట్ అండ్ మౌస్ గేమ్ లాగా నడుస్తుంది 'రివాల్వర్ రీటా'. నలుగురు ఆడవాళ్లుండే ఇంట్లో ఒక రౌడీ చనిపోవడంతో పెద్ద టెన్షన్ బిల్డ్ అవ్వాలి.. ఉత్కంఠ రేగాలి కానీ.. అలాంటి ఫీలింగే రానివ్వకుండా చాలా తేలిగ్గా ఆరంభ సన్నివేశాలను లాగించేయడంతోనే 'రివాల్వర్ రీటా' మొదట్లో చప్పబడిపోయింది. ఈ నేరం నుంచి బయటపడడానికి హీరోయిన్ ఫ్యామిలీ తర్వాత చేసే ప్రయత్నాలు కూడా ఆసక్తికరంగా అనిపించవు. మరోవైపు రౌడీ గ్యాంగుల మధ్య గొడవలు.. ఎత్తులు పైఎత్తులు కూడా ఉత్కంఠభరితంగా అనిపించవు. ఒకరినొకరు మోసం చేయడం.. చంపుకోవడం.. ఇలా కథలో ట్విస్టులు వస్తాయి కానీ.. అవేమీ థ్రిల్లింగ్ గా అనిపించవు. కీర్తి సురేష్ కు ఓ మోస్తరు పాత్ర ఇచ్చినా తన పెర్ఫామెన్సుతో దాన్ని ఇంకో స్థాయికి తీసుకెళ్తుంది. కానీ తన పాత్రను మరీ సాధారణంగా రాసుకున్నాడు దర్శకుడు. ఆమె ప్రత్యేకతను చాటే సన్నివేశాలే ఇందులో లేకపోయాయి. క్లైమాక్సులో ఆ క్యారెక్టర్ కొంచెం పర్వాలేదనిపిస్తుంది. అక్కడొచ్చే మలుపులు కూడా పర్వాలేదు. కానీ అప్పటికే సినిమా ప్రేక్షకులకు భారంగా మారడంతో.. పతాక సన్నివేశాల వల్ల పెద్దగా ప్రయోజనం లేకపోయింది. మొత్తంగా చూస్తే రొటీన్ కథాకథనాలు.. ఇంటెన్సిటీ లేని సన్నివేశాల వల్ల 'రివాల్వర్ రీటా' పూర్తిగా మిస్ ఫైర్ అయింది.

కీర్తి సురేష్ నటించిందంటే.. సినిమా ఎలా ఉన్నా తన పెర్ఫామెన్స్ బాగుంటుంది. కానీ 'రివాల్వర్ రీటా' మాత్రం ఆ కోవలో చేరదు. రీటా పాత్రలో ఏ ప్రత్యేకతా లేకపోవడంతో కీర్తి పెర్ఫామెన్స్ కూడా సాధారణంగా అనిపిస్తుంది ఇందులో. ఆమె చూడ్డానికి బాగుంది. హావభావాలు ఓకే. రాధిక శరత్ కుమార్ తల్లి పాత్రలో రాణించింది. ఫైట్ మాస్టర్ సూపర్ సుబ్బరాయన్ పాండ్యన్ పాత్రలో ఓకే అనిపించాడు. ఆయన కొడుకు పాత్రలో సునీల్ గురించి మాట్లాడుకోవడానికేమీ లేదు. తన లుక్ బాగుంది కానీ.. పాత్ర తేలిపోయింది. అజయ్ ఘోష్ క్యారెక్టర్ ఓకే. జాన్ విజయ్ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఇలాంటి కామెడీ పోలీస్ పాత్రలు అతను చాలానే చేశాడు. రెడిన్ కింగ్స్ లీ కామెడీ పర్వాలేదనిపిస్తుంది. మిగతా ఆర్టిస్టులంతా మామూలే.

**'రివాల్వర్ రీటా' మూవీ రివ్యూ**
**రేటింగ్- 2/5**
**నటీనటులు: కీర్తి సురేష్- రాధిక శరత్ కుమార్- సునీల్- అజయ్ ఘోష్- జాన్ విజయ్- సూపర్ సుబ్బరాయన్- రెడిన్ కింగ్స్ లీ తదితరులు**
**సంగీతం: సీన్ రోల్డాన్**
**ఛాయాగ్రహణం: దినేష్ కృష్ణన్**
**నిర్మాతలు: సుధన్ సుందరం- జగదీష్ పళనిస్వామి**
**రచన-దర్శకత్వం: జేకే చంద్రు**

'రివాల్వర్ రీటా' టెక్నికల్ గా ఓ మోస్తరుగా అనిపిస్తుంది. బిట్ సాంగ్స్ తప్ప ఫుల్ లెంగ్త్ పాటలు లేని ఈ చిత్రంలో సీన్ రోల్డాన్.. సినిమా శైలికి తగ్గ నేపథ్య సంగీతం అందించాడు. దినేష్ కృష్ణన్ ఛాయాగ్రహణం బాగుంది. నిర్మాణ విలువలు సినిమాకు అవసరమైన స్థాయిలో ఉన్నాయి. జేకే చంద్రు రచయితగా.. దర్శకుడిగా.. రెండు రకాలుగా నిరాశపరిచాడు. హాలీవుడ్ నుంచి కోలీవుడ్ వరకు వచ్చిన అనేక క్రైమ్ కామెడీ సినిమాల నుంచి సన్నివేశాలను ఏరుకుని ఈ కథ రాసుకున్నట్లుందే తప్ప.. అతను కొత్తగా ఏమీ చూపించలేకపోయాడు. అక్కడక్కడా కొంచెం కామెడీ పండించగలిగినా.. ఉత్కంఠ రేకెత్తించేలా కథనాన్ని నడిపించలేకపోయాడు.

## ఆర్థిక భారం లేకుండా
# అందరికీ ఆరోగ్య సంరక్షణ!



నవతరం-శ్రీకాకుళం

ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ప్రతి ఒక్కరూ నాణ్యమైన ఆరోగ్య సేవలను పొందేలా చూడటమే విశ్వజనీన ఆరోగ్య పరిరక్షణ దినోత్సవం ప్రధాన లక్ష్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ కె. హరిబాబు స్పష్టం చేశారు. ఆరోగ్యం కోసం చేసే ఖర్చుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం పెద్ద సంఖ్యలో ప్రజలు తీవ్ర పేదరికంలోకి నెట్టబడుతున్నారని, కనీసం సగం మందికి ఇప్పటికీ అవసరమైన వైద్య సేవలు అందడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సింగపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏఎన్ఎంలకు, ఇతర సిబ్బందికి శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ జి. ఇందిరాప్రసాద్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ లిల్లీ పాల్గొన్నారు.

# సింధు నందన్ వైద్యానికి 50,000 ఆర్థిక సాయం

## చిన్నారుల వైద్యానికే సుమారు 7.50 లక్షలు ఆర్థికసాయం



నవతరం-ఎచ్చెర్ల

ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామంలో 5 ఏళ్ల సింధు నందన్ కి ఆరోగ్యం బాగోలేదని హాస్పిటల్ కు తీసుకువెళ్తే అన్ని పరీక్షలు జరిపిన వైద్యులు కాలేయ సమస్య ఉందని.. లివర్ మార్పిడి చేయాలని తెలియజేశారు. గుండె పగిలే విషయం విన్నాక ఏమి చేయాలో తెలియక కొంత మంది దగ్గర అప్పుచేసి సర్జరీ కొరకు హైదరాబాద్ లో రెయిన్బో హాస్పిటల్ లో జాయిన్ చేశారు.. తల్లిదండ్రులు రామరావు, ధనలక్ష్మీ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. తమ దగ్గర వున్న డబ్బులన్నీ అయిపోవడంతో దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలుసుకున్న టెక్కలి అభయం యువజన సేవా సంఘం వారు స్పందించి పలువురి దాతల ద్వారా సేకరించిన 50 వేల రూపాయల ఆర్థిక సాయం ను శుక్రవారం నందన్ తండ్రి రామారావు కు అందించినట్లు అభయం సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాస రావు తెలియజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కేవలం చిన్నారుల వైద్యం కే సుమారు 7.5 లక్షల వరకు సాయం చేశామన్నారు. అభయం సేవా సంఘం పిలుపు మేరకు స్పందించి తోచిన సాయం అందించిన ప్రతిదాతకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాస రావు,సెక్రటరీ లాడె కామేశ్వర రావు, సంఘ సభ్యులు యన్ సింహాచలం, అద్దాల వీరభద్రచారి, ధర్మవరపు పూర్ణాచారి, చిత్రాడ సతీష్ బాబు, మున్నా, ఉంగరాల గోవిందరావు, సాహుకారి రాజేష్, జోగి ఆదినారాయణ, పాల్గొన్నారు.

# మనసున్న దాతలు ముందుకు రావాలి...

- స్పందించిన మిత్రులకు కృతజ్ఞతలు
- జేసీ రౌతు.జగదీశ్



నవతరం-ఎచ్చెర్ల

మనసున్న దాతలు ముందుకు వచ్చి, ఆపదలో ఉండేవారిని ఆదుకోవాలని జేసీఐ శ్రీకాకుళం మెయిన్ నూతన కోశాధికారి జగదీశ్ (జగ్గు బ్రో ) అన్నారు. ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామం, బీసీకాలనీలో కూలి పని చేసు కుంటూ జీవనం కొనసాగిస్తున్న సింధు.రామారావు కుమారుడు సింధు.నందన్ కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ప్రాణంకోసం పోరాడుతున్న విషయం విదితమే. స్థానిక వైద్యులు బెందు.దిలీప్ అందించిన సమాచారం మేరకు, సేవకులు, జేసీ, ఎల్ఎన్ ఉపాధ్యక్షులు ఉర్లం.శివతేజ ద్వారా పూర్తి వివరాలు సేకరించి ఈ రోజు చిరు సహాయాన్నందించామని తెలిపారు.

శుక్రవారం నందన్ కుటుంబ సభ్యులకు, దాతలు, మిత్రుల సహాయంతో సేకరించిన రూ.35 వేలు ఆర్థికసహాయాన్ని అందించామని, మాట్లాడుతూ రెండు వారాలు తర్వాత శస్త్ర చికిత్స చేస్తారని, ఆర్థికంగా కుటుంబం చితికిపోయిందని, మనసున్న దాతలు బొట్ట.రమేష్ (75698 22086), కర్రి గోవింద (90006 01005) కు గాని, ఫోన్ పే ద్వారా సహాయమందించాలన్నారు. అనంతరం స్పందించిన మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ సభ్యులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మొబైల్ ద్వారా జీవిత ధ్రువ పత్రాలు

-ఎస్.టి.వో తులసీరావు

నవతరం-పొందూరు

రాష్ట్ర ప్రభుత్వ పింఛను దారులు, కుటుంబ పింఛను దారులు తమ జీవిత ధ్రువ పత్రాలను తమ మొబైల్ ద్వారా కూడా సమర్పించవచ్చు.ఈ విషయాన్ని స్థానిక ఉప ఖజానా శాఖాధికారి ఎం.తులసీరావు శుక్రవారం తెలిపారు.వచ్చే జనవరి 1నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు వీటిని సమర్పించాల్సి ఉంటుంది.వీటిని మీ మొబైల్లో సమర్పించడానికి https://play.google.com/store/apps/details?idRin.gov.uidai.facerd అలాగే https://play.google.com/store/apps/details?idRcom.aadhaar.life లింకులపై క్లిక్ చేసి మొదటగా మీ ఆండ్రాయిడ్ మొబైల్ లో ఇన్స్టాల్ చేసుకోవాలి. ఆ తరువా జీవన్ ప్రమాణ్ యాప్ మీ మొబైల్ లోకి వస్తుంది. దానిపై క్లిక్ చేసి మొదటగా ఎవరిదైనా ఆధార్ నెంబరు అలాగే మొబైల్ నెంబరు ఈమెయిల్ ఐడి నమోదు చేయవలసి ఉంటుంది. ఆ తర్వాత ఈ యాప్ కి ఒక నేమ్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. తర్వాత స్కాన్ అని ఆప్షన్ అడుగుతుంది ఎవరు ఆధార్ నెంబర్ ఇచ్చామో వారి ముఖ చిత్రాన్ని స్కాన్ చేయవలసి ఉంటుంది. ఆ తర్వాత సక్సెస్ ఫుల్ ఇన్ స్టాల్ అని వస్తుంది. ఆ తరువాత నుండి పెన్షనర్స్ ఎవరైతే వారిది ఆధార్ నంబరు మొబైల్ నెంబరు ఎంటర్ చేసి క్లిక్ చేసిన తర్వాత ఓ.టి.పి వస్తుంది. దానిది ఎంటర్ చేసిన తర్వాత ఇదివరకు మీరు వేసి ఉంటే మీ వివరాలు కనిపిస్తాయి. ఇదివరకు వెయ్యని పక్షంలో మీ యొక్క వివరాలను వివరంగా ఇవ్వవలసి ఉంటుంది. అలాగే సంబంధిత ఎస్.టి.వో ను కరెక్ట్ గా సెలెక్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత సర్టిఫికెట్లు ఉంటాయి . వాటిని టిక్ చేసి స్కాన్ అని ఆప్షన్ ఉంటుంది. స్కాన్ పై క్లిక్ చేసిన తర్వాత సంబంధిత పెన్షన్ పెన్షనర్ యొక్క ముఖాన్ని స్కాన్ చేయవలసి ఉంటుంది.

ఆ తర్వాత సక్సెస్ గా వచ్చినట్లుగా మెసేజ్ వస్తుంది. అలాగే మీ మొబైల్ కూడా మెసేజ్ వస్తుంది. మీ మొబైల్ లో వచ్చిన మెసేజ్ లో ఒక లింకు కూడా రావడం జరుగుతుంది . దానిపై క్లిక్ చేసినచో తమ లైఫ్ సర్టిఫికేట్ ను డౌన్లోడ్ చేసుకోవచ్చు.

ఇక పునర్వివాహం చేసుకున్న ఫ్యామిలీ పెన్షనర్లు అలాగే 315 పెన్షనర్లు సంబంధిత ఎస్.టి.వో కార్యాలయంలో వార్షిక జీవిత ధ్రువ పత్రాన్ని ఫిజికల్(భౌతికంగా) ఇవ్వవలసి ఉంటుంది. 2026 జనవరి ఒకటో తేదీ నుండి 2026 ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఇందులో నమోదు చేసుకోవాల్సి ఉంటుందనే విషయాన్ని గమనించాలని ఎస్.టి.వో పేర్కొన్నారు.

# వంశధార రిజర్వాయర్‌లో ఫింగర్లింగ్ చేప పిల్లల విడుదల





నవతరం-హిరమండలం

హిరమండలం మండలంలోని బీఆర్ఆర్ వంశధార రిజర్వాయర్‌లో శుక్రవారం మొత్తం 4 లక్షల 86 వేల ఫిష్ ఫింగర్లింగ్ చేప పిల్లలను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు విడుదల చేశారు. శ్రీకాకుళం ఫిష్ సీడ్ ఫామ్, ఇచ్ఛాపురం గవర్నమెంట్ సీడ్ ఫామ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ, మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ఇది ఎంతో కీలకమని పేర్కొన్నారు. అధిక నాణ్యత కలిగిన చేప పిల్లల విడుదలతో వంశధార రిజర్వాయర్‌లో చేపల ఉత్పత్తి రెట్టింపు అవుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో మత్స్యకారుల ఆదాయాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంచి సంపద, జీవనోపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమనీయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



నవతరం-పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 20వ వార్డు, నేతాజీ నగర్ లో సుమారు రూ. 15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీష శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడి కాలనీవాసులు సమస్యలపై వినతిపత్రం అందజేయగా, పరిశీలించి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అనంతరం 4వ వార్డు, పద్మనాభపురం కాలనీ, ఆంజనేయ విగ్రహం వద్ద సుమారు రూ.9.5 లక్ష లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. అలాగే సమీప ప్రాంతంలోని వెంకటేశ్వర కాలనీలో సుమారు రూ.10 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి కాలనీవాసుల ప్రధాన సమస్యలను పరిష్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో పరుగులు పెడుతున్న అభివృద్ధిని చూసి, మరీ ముఖ్యంగా పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో చేపడుతోన్న అభివృద్ధిపనులకు మెచ్చి ప్రతి వీధిలో ఆడపడుచులు ఆప్యాయంగా పలకరించి స్వాగతిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలాస ముఖ్య నాయకులు, కాలనీవాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ కోటదుర్గ అమ్మవారి దేవస్థానం హుండీలు లెక్కింపు

నవతరం-పాలకొండ

దేవదాయ ధర్మదాయ శాఖ, పార్వతీపురం మన్యం జిల్లా, పాలకొండ నగరపంచాయితీ నందు వేంచేసియున్న శ్రీ కోటదుర్గ అమ్మవారి దేవస్థానము నందు గల శాశ్వత హుండీలు ఎనిమిది 63 రోజులు కు గాను రూ:8,44,301/-లు (అక్షరముల ఎనిమిది లక్షల నలభై నాలుగు వేల మూడు వందల ఒక్కరూపాయిలు మాత్రమే ఆదాయం వచ్చినది. సదరు హుండీలో (మిక్స్ బంగారం ఐదు గ్రాముల ఏనిమిది వందల మిల్లీ గ్రాములు మరియు మిక్స్ వెండి ఐదు వందల తొంభై ఒక్క గ్రాములు మాత్రమే) సదరు లెక్కింపు కార్యక్రమం పాలకొండ డివిజన్ తనిఖీదారు ఎస్.రామారావు పర్యవేక్షణలో జరిగినది. ఈ కార్యక్రమములో ఆలయ కార్యనిర్వహణాధికారి, ఆలయ అర్చకులు - సిబ్బంది మరియు ఏపీజీవీబీ బ్యాంక్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది. పోలీస్ సిబ్బంది మరియు భక్తులు, పార్వతీపురం పాలకొండ సేవకులు హాజరైయ్యారు.




Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**